క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐఐఆర్ఎం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఎన్ వీడియా ఫీడర్ పరిధిలో..

ఎన్‌వీడియా 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వజ్రమ్ అపార్ట్‌మెంట్స్, వైజయంతి అపార్ట్‌మెంట్స్, ఎన్‌వీడియా నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

గోల్డెన్ తులిప్ ఫీడర్ పరిధిలో..

గోల్డెన్ తులిప్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు రాఘవేంద్రకాలనీ ఏబ్లాక్ ప్రాంతంలో 11 గంటల నుంచి 12 గంటల వరకు మహీంద్రా షోరూమ్, శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

నానక్‌రాంగూడ పరిధిలో..

నానక్‌రాంగూడలోని 11కేవీ చర్చ్ ఫీడర్ పరిధిలో..ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ, సుమధుర అపార్ట్‌మెంట్స్, ది శ్రీరామ స్కూల్, గోల్ఫ్ వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్‌హిల్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థి నాయకుల ధర్నా

మాదాపూర్: విద్యార్థి సాత్విక్ మరణానికి కారణమైన శ్రీచైతన్య విద్యాసంస్థలను వెంటనే రద్దు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. మాదాపూర్‌లోని చైతన్య కార్పొరేట్ విద్యాసంస్థ ప్రధాన కార్యాలయం ముందు శుక్రవారం భారత జాగృతి విద్యార్థి విభాగం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు ప్రశాంత్ మాట్లాడుతూ చనిపోయిన విద్యార్థి కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని కోరారు.

'మనూ'లో సాంస్కృతిక కార్యాచరణ కేంద్రం ఏర్పాటు

రాయదుర్గం: మనూలో పాత క్యాంటిన్ భవనంలో విశ్వవిద్యాలయం విద్యార్థుల కోసం సాంస్కృతిక కార్యాచరణ కేంద్రాన్ని ఈనెల 6వ తేదీన వీసీ ఐనుల్ హసన్ ప్రారంభించనున్నారు .అనంతరం ఉదయం 10.30 గంటలకు 'కథ రాయడం ఎలా' అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తారు. వర్క్‌షాప్‌ను డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

ఆలయ వార్షికోత్సవం

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని జనప్రియ ఫేజ్ 1లోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయ వార్షికోత్సవ ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన ం చేశారు. బీఆర్ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వెంకటేష్, రాము, చలపతి, ఆనంద్, మీనాక్షి, కమలమ్మ, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

పటాన్‌చెరు: భారతదేశానికి దశదిశ నిర్దేశించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కొనియాడారు. ఇస్నాపూర్ గ్రామ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహనీయుల జీవిత చరిత్రలు నేటి తరాలకు స్ఫూర్తిదాయకం కావాలన్న సమున్నత లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బూరిగారి వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాండు, ఇస్నాపూర్ గ్రామ సర్పంచ్ బాలమణి శ్రీశైలం పాల్గొన్నారు.

అన్నీ సమస్యలే....





హఫీజ్‌పేట్ మంజీరా పైప్‌లైన్ రోడ్డులో గుంతలు



- డివిజన్‌లో కానరాని అభివృద్ధి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి, రోడ్ల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మంజీరా రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు

- డివిజన్ పరిధిలోని మంజీరా రోడ్డు పైప్‌లైన్ నుంచి మదీనాగూడ, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామం , సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, బస్తీలకు వెళ్లే రోడ్లు గుంతలు పడ్డాయి. ఎమ్మెల్యే చొరవతో కొంతమేర సీసీ రోడ్లు నిర్మిస్తున్నా పర్యవేక్షణ లేదని స్థానికులు అంటున్నారు.
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు మాత్రమే హాజరవుతారని, బస్తీల సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక నేరుగా ఎమ్మెల్యేకు విన్నవించుకునే పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.
- రెండుసార్లు కార్పొరేటర్‌గా గెలిచినా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంలో విఫలమయ్యారన్నారని ఆరోపిస్తున్నారు. పేరుకే కార్పొరేటర్ అని, సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియడం లేదని డివిజన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- గుంతల రోడ్ల వల్ల రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదాల బారినపడుతున్నారు.
- మంజీరా రోడ్డులో పైప్‌లైన్ లీకేజీల వల్ల నీరు రోడ్డుపై వృథాగా పోతోంది.



హఫీజ్‌పేట్ గ్రామంలో ..

సమస్యలు ఎవరికి చెప్పాలి..?



డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. కార్పొరేటర్ ఎన్నికల్లో గెలిచినప్పటి నుంచి కనబడకుండా పోయారు. ఎప్పుడో శంకుస్థాపన సమయంలో వస్తారు తిరిగి మరలా కనిపించరు. ఇప్పటికైనా ప్రజల సమస్యలు తెలుసుకోవాలి.

–మహేష్ యాదవ్, హఫీజ్‌పేట్

రోడ్లు వేయాలి



ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఫిర్యాదు చేద్దామంటే పట్టించుకునే ప్రజాప్రతినిధులు లేరు. ఏదో తూతూ మంత్రంగా రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారే తప్ప, కొత్త రోడ్డు మాత్రం వేయడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలి.

– జితేందర్, ఓల్డ్ హఫీజ్‌పేట్

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ .. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసిన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: పదో తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ సూచించారు. కొండాపూర్‌లోని మసీదుబండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదవాలనే తపనతో స్టడీ మెటీరియల్‌ను నిష్ణాతులైన ప్రొఫెసర్ల సమక్షంలో ముద్రించడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మెటీరియల్ అందిస్తామన్నారు .కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం అనంతరెడ్డి, నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, రమేష్, నర్సింహ, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి చేప పిల్లల పంపిణీ

పటాన్‌చెరు: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని, నియోజకవర్గంలోని మత్స్యకారుల అభ్యున్నతికి సహకరిస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని తిమ్మక్క చెరువు కట్టపైన జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో రూ.20లక్షల నిధులచే నిర్మించిన దుకాణాల సముదాయం, సామాజిక భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నీలి విప్లవం సృష్టించారన్నారు. నూతనంగా నిర్మించిన భవనంలో రెండు దుకాణాలను స్టోరేజి గదికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సాధికారత

పటాన్‌చెరు: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సాధికారత సాధ్యమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని నియోజకవర్గంలో మహిళలకు క్రీడా పోటీలను శుక్రవారం మైత్రి మైదానంలో క్రీడాజ్యోతి వెలిగించి ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మహిళల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలను రూపొందించారన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

'గోదావరి కట్స్'ను ప్రారంభించిన కార్పొరేటర్



గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్స్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'గోదావరి కట్స్' స్టోర్‌ను శుక్రవారం శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన వాటిని అందించాలని ఆయన సూచించారు. నిర్వాహకులు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి కట్స్ నగరంలో 9వ స్టోర్ అని, నాన్ వెజ్‌లో 40 రకాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేంద్ర తల్లూరి, శ్రీనివాసరాజు, ప్రణీత్, నిఖిల్‌రెడ్డి, నిహాల్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై సర్వత్రా నిరసనలు



జాతీయ రహదారిపై గ్యాస్ బండ ఎత్తి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



ఖాజాగూడలో నిరసన తెలుపుతున్న నాయకులు

గచ్చిబౌలి/రాయదుర్గం: గ్యాస్ ధరల పెంపుపై శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలుచోట్ల నిరసనల జోరు సాగింది. రోడ్డుపై కట్టెల పొయ్యి వెలిగించి నినాదాలు చేశారు. ఖాజాగూడలో గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా నాయకత్వంలో రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంచిన ధరలు వెంటనే తగ్గించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జంగయ్యయాదవ్, నరేష్, అంజమ్మ, చెన్నం రాజు, రమేష్‌గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

పటాన్‌చెరు పట్టణంలో..

పటాన్‌చెరు టౌన్: పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీఎం కేసీఆర్ పిలుపుమేరకు..ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

మియాపూర్‌లో..

మియాపూర్‌లో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేశారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. శుక్రవారం సాయంత్రం ఖాజాగూడలో సాయిబాబా సమక్షంలో మాజీ వార్డు సభ్యురాలు అంజమ్మ ఆధ్వర్యంలో మధురానగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.నాయకులు నరేష్, రమేష్‌గౌడ్, సుగుణ పాల్గొన్నారు.

రేగులకుంట చెరువు పరిశీలన

మియాపూర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ రేగులకుంట చెరువులో గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమాన్ని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎంటమలాజీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని లింగంపల్లి చౌరస్తా పోలీస్‌స్టేషన్ గేట్ ఎదుట మురుగు నీరు ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కాలంగా లింగంపల్లి చౌరస్తాలో మురుగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి.

'మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వం'

మాదాపూర్: మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. మెడికల్ విద్యార్థిని మృతిపై బీఆర్ఎస్ నాయకులు కనీసం స్పందించ లేదని, ఇదేం పద్ధతని విమర్శించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ కమాన్ వద్ద శుక్రవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్, కన్వీనర్ రాఘవేంద్రరావు, నాయకులు రాధాకృష్ణ యాదవ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా యువమోర్చ కన్వీనర్ కొత్తపల్లి పద్మ, మహిళ నాయకురాలు రేణుక, అరుణభారతి, శ్రీలత, దేవిరెడ్డి, విజయలక్ష్మి, సుశీల,పార్వతి పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలని నిరసన

పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు....
మద్దతు ఇచ్చిన బీజేపీ



హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న కేవీ విద్యార్థులు, తల్లిదండ్రులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రధాన గేటు ముందు సేవ్ కేవీ కోర్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ప్లకార్డులు, భారీ బ్యానర్లతో విద్యార్థులు నిరసన తెలిపారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ డాక్టర్ బిఎస్‌రావు మాట్లాడుతూ ఈ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం హెచ్‌సీయూలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయలో 7,8,9 తరగతులను నిర్వహిస్తున్నారు. 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడేళ్ల వరకు ఈ కేంద్రీయ విద్యాలయను కొనసాగిస్తే విద్యార్థుల చదువులు పూర్తవుతాయి కనుక వచ్చే మూడేళ్ల పాటు కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కానీ హెచ్‌సీయూ పాలక మండలి మాత్రం ఈ ఏడాది నుంచే ఈ కేంద్రీయ విద్యాలయను మూసివేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

పోరాటానికి మద్దతు: గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

హెచ్‌సీయూలో కేంద్రీయ విద్యాలయను కొనసాగించాలనే డిమాండ్‌కు సంపూర్ణ మద్దతును బీజేపీ ఇస్తుందని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసనకు వారు శుక్రవారం మద్దతు ప్రకటించారు.

విద్యార్థులకు న్యాయం చేసే వరకు పోరాటం: సేవ్ కేవీ కోర్ కమిటీ

కేంద్రీయ విద్యాలయను వచ్చే మూడు ఏళ్లపాటు కొనసాగిస్తే పాఠశాలలో విద్యార్థుల చదువు పూర్తవుతుందని, అంత వరకు అవకాశం కల్పించాలని సేవ్ కేవీ కోర్ కమిటీ ప్రతినిధులు కోరారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ, కేంద్రీయ విద్యాలయ సమితి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

భార్య కేసు పెట్టిందని..

- భర్త ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

పటాన్‌చెరుటౌన్: భార్య కేసు పెట్టిందని జీవితంపై విరక్తి చెందిన భర్త ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన భానూర్-బీడీఎల్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం పరిధిలోని వెలిమెలకు చెందిన చాకలి రాజు(36) వెలిమెల సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 2014లో లింగంపల్లికి చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో మమత పుట్టింటికి వెళ్లింది. చందానగర్ పోలీసుస్టేషన్‌లో భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. పిల్లలు, భార్య దూరమయ్యారని, అంతేకాకుండా తనపై కేసు పెట్టిందని జీవితంపై విరక్తితో రాజు ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చిన రాజు నోటి నుంచి నురుగు వస్తుండటంతో మేనత్త చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి 11 గంటలకు మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి తండ్రి చాకలి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టీహబ్-జేబీఐఐఏఐ ఎంఓయూ



టీహబ్ ప్రాంగణంలో.. ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలో టీహబ్-జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్వెంటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(జేబీఐఐఏఐ) మధ్య ఒక ఒప్పందం కుదిరింది. టీ హబ్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. టీ హబ్‌ను మరింతగా ఇంక్యుబేటర్ సెంటర్‌గా రూపొందించడానికి, విద్యాసంస్థలలో ఇన్నోవేషన్ సంస్కృతిని పెంపొందించుకోవడానికి జేబీఐఐఏఐ- టీహబ్ పరస్పరం సహకరించుకుంటాయి. ఈ సందర్భంగా టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో స్టార్టప్‌ల వృద్ధిని ఉత్ప్రేరకపర్చడానికి, విద్యార్థులకు వేదిక అందించడానికి నిబద్ధత వ్యవస్థాపకులు, సంఘం సభ్యులు సహకరించడానికి, విలువ సృష్టించడానికి రెండు సంస్థలు కలిసి పనిచేస్తాయన్నారు. జేబీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ కార్యదర్శి జేవి కృష్ణారావు మాట్లాడుతూ మా రెండు సంస్థల సహకారం, ఒప్పందం సమాజానికి గణనీయమైన ప్రయోజనాలను తీసుకొస్తుందని, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుందన్నారు.

ఈటీపీఆర్ఐలో..

గచ్చిబౌలి: విద్య, పరిశోధన, ,శిక్షణ మరియు ఆవిష్కరణ రంగాలలో సహకరించడానికి ఈపీటీఆర్ఐ(ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్), ఎన్ఐఎంఎస్ఎంఈ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)లు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. శుక్రవారం గచ్చిబౌలిలోని పీటీఆర్ఐలో వాతావరణ మార్పు కేంద్రం సీనియర్ సైంటిస్టు డాక్టర్ శేష శ్రీనివాస్, ఎన్ఐఎంఎస్ఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరీ స్వరూప ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. వాతావరణ మార్పు, ఆకుపచ్చ ఉత్పత్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ , కెపాసిటీ రంగాల్లో పరిశోధన, ఆవిష్కరణలను బలోపేతం చేసేందుకు ఒప్పందం దోహదం చేస్తున్నందని శేష శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దిబ్యేందు చౌదరి, మధు చంద్రిక, ఎం .ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.